క్లుప్తంగా

కన్నయ్యగూడ పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ కన్నయ్యగూడ గిరిజన గ్రామాన్ని ఎంపీడీవో మోహన్ కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకర్‌లు శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన 15 మంది విద్యార్థులు పెద్దలంబ పంచాయతీ నారాయణపురం గ్రామంలో చదువుతున్నారు. అయితే గత కొన్ని రోజులుగా సరైన రహదారి లేకపోవడంతో వాళ్లు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు. దీనిపై రెండ్రోజుల క్రితం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సుమారు 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉరిటి రంజిత్ కుమార్ ఉన్నారు.

అటవీ సంపదను రక్షించుకుందాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: మానవాళి మనుగడకు ఎంతగానో ఉపకరిస్తున్న అటవీ సంపదను, అడవులను పరిరక్షించుకుందామని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత పిలుపునిచ్చారు. కళాశాలలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడవులను రక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, అధ్యాపకులు జి.రవి కుమార్, పి.అన్నాజీరావు, ఎస్.పరమేశ్వరరావు జి.పూజా భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి జ్యోతిర్మయి

సరుబుజ్జిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని పురుషోత్తపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బమ్మిడి జ్యోతిర్మయి సూచించారు. బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రొట్టవలస, సరుబుజ్జిలి అంగన్‌వాడీ కార్యకర్తలకు రొట్టవలస హైస్కూల్‌లో పోషణ్ భీ పడాయి భీ శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రమణమూర్తి, సూపర్‌వైజర్లు ఎం.జానకి లక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రక్తహీనత కలిగిన చిన్నారులను అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించాలని ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎస్.అనూరాధ సూచించారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో పోషణ్ భి పడాయి భి శిక్షణ రెండోరోజు శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కారం



శ్రీనివాసనగర్ వద్ద పనులు చేపడుతున్న దృశ్యం

నరసన్నపేట: మేజర్ పంచాయతీ పరిధి శ్రీనివాసనగర్‌లో మురుగు నీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సర్పంచ్ బూరల్లి శంకర్, పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి స్పందించి శుక్రవారం జేసీబీతో పనులు చేయించారు. కాలువలకు అడ్డంగా ఉన్న మురుగు, మట్టిని తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వినూత్న బోధనతో ఉత్తమ ఫలితాలు

జలుమూరు: తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వినూత్నంగా బోధిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఆర్‌పీఎస్ ప్రసాదరావులు అన్నారు. మండలంలోని రామయ్యవలస, గొటివాడ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదవడం, రాయడంతో పాటు ఆటపాటలు కూడా ప్రాథమిక స్థాయిలో ఎంతో అవసరమన్నారు. వీటి ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. వీరితోపాటు ఉపాధ్యాయులు సీఆర్పీ రవి కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టేకుచెట్ల వేలంపాట వాయిదా

బూర్జ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చేపట్టాల్సిన టేకుచెట్ల వేలంపాటను వాయిదా వేసినట్లు తహసీల్దార్ వై.వి.పద్మావతి తెలియజేశారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

విజ్ఞాన భాండాగారం..

ఏర్పాటుకు నోచుకోని వైనం..!

- ఎల్.ఎన్.పేటలో **కనిపించని ప్రభుత్వ గ్రంథాలయం**
- జిల్లాలో గ్రంథాలయం **లేని** మండలం ఇదే
- 26 ఏళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు



ఎల్.ఎన్.పేట మండల కేంద్రం

ఎల్.ఎన్.పేట: జిల్లాలో 1999 ఫిబ్రవరి 26వ తేదీన ఎల్.ఎన్.పేట కేంద్రంగా కొత్త మండలాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. మండలం ఏర్పడి 26 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వ గ్రంథాలయం ఏర్పాటు చేయలేదు. జిల్లా నుంచి పలువురు రాష్ట్ర, కేంద్రమంత్రులుగా పనిచేసినా గ్రంథాలయం ఏర్పాటుకు నోచుకోకుండా పోయిందని స్థానికులు, విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు

ఎల్.ఎన్.పేట మండలం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడంతో అనేక మంది పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయ సేవలు కోసం శ్రీకాకుళం, ఆమదాలవలస, హిరమండలం, పాతపట్నం, కొత్తూరు వంటి పట్టణ ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. మండలం నుంచి ప్రతీ పోటీ పరీక్షకు సుమారు 10 వేలకు పైగా విద్యార్థులు హాజరవుతుంటారు. ప్రతీ ఏడాది దాదాపు 600 మంది పదో తరగతి విద్యార్థులు, 300 మంది వరకు ఇంటర్ విద్యార్థులు చదువులు పూర్తి చేస్తున్నారు. వీరంతా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలో గ్రంథాలయ సేవలు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఏర్పాటు చేయాలి



గ్రామీణ ప్రాంతం ఎక్కువగా ఉన్న ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో ప్రభుత్వ గ్రంథాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతీ ఏడాది ఎంతో మంది నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుంటారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. గ్రంథాలయం లేకపోవడం వలన నిరుద్యోగులు పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు.

– పెద్దకోట వెంకటరావు, ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్షుడు, ఎల్.ఎన్.పేట

ఎంతో ఉపయోగకరం



మండల కేంద్రంలో ప్రభుత్వ గ్రంథాలయం ఏర్పాటు ఎంతో అవసరం. నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల వారికి గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుంది. మండల కేంద్రానికి అనేక పనులపై వెళ్లినవారు వారి పనులు జరిగేంత వరకు వేచి ఉండాల్సి వస్తే గ్రంథాలయానికి వెళ్లి పత్రికలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదువుకునే వీలు ఉంటుంది. పాలకులు, అధికారులు స్పందించి తక్షణమే గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

– ఉకలాపు రాజారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

అధ్వానం



సారవకోట మండల కేంద్రంలో పలు వీధుల్లోని మురుగు నీటి కాలువలు పూడికలతో నిండిపోయి అధ్వానంగా మారాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

– సారవకోట

చలివేంద్రం ఏర్పాటు



బూర్జ మండలంలోని ఉప్పినివలస గ్రామంలో ఈవోపీఆర్డీ పి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో చలివేంద్రం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులు, గ్రామస్తుల వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

– బూర్జ

చిత్రలేఖనం పోటీలు



పొందూరు మండలంలోని తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుగుబెల్లి గోపాలరావు, డ్రాయింగ్ టీచర్ రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

– పొందూరు

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



రొట్టవలస వీధుల గుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిపోతున్న మట్టి



పాలవలస నుంచి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న మట్టి

సరుబుజ్జిలి: మండలంలో రొట్టవలస, పాలవలస, పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని భూముల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. చెరువు గర్భాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. మట్టి తరలిపోతున్నా సంబంధిత అధికార యంత్రాంగాలు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ప్రకారం మట్టి తవ్వకాలు చేపట్టేముందు మైన్స్, రెవెన్యూ యంత్రాంగాల నుంచి చలానాలు కట్టి అనుమతులు తీసుకోవాలి. అయితే ఈ విషయాన్ని తహసీల్దార్ ఎల్.మధుసూదన వద్ద ప్రస్తావించగా మట్టి రవాణాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆశీల వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: మేజర్ పంచాయతీ పాతపట్నంలో ఆశీల వేలంపాటలు ఖరారయ్యాయని టెక్కలి టీపీఎల్‌పీవో ఆర్.గోపిబాల తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో రోజువారీ మార్కెట్, కార్ అండ్ బస్టాండ్, కమేళాకు సంబంధించిన ఆశీల వేలంపాట నిర్వహించారు.

రోజువారీ మార్కెట్ పాటను రూ.2,97,700లకు దూళి నవీన్, కారు అండ్ బస్టాండ్ రూ.1,84,000లకు దూళి జ్యోతి దక్కించుకున్నట్లు ఇన్‌చార్జి ఈవో కిషోర్ తెలిపారు. అలాగే కమేళా వేలంపాటను రూ.29,000లకు మల్ల ధనుంజయరావు దక్కించుకున్నారు. అయితే గతేడాది కంటే ఈ ఏడాది తక్కువ వేలంపాటకే దక్కించుకోవడం గమనార్హం. ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు, సర్పంచ్ శిర్ల వేణుకుమారి, వార్డు సభ్యులు సమక్షంలో వేలంపాట నిర్వహించారు.

పరీక్షా కేంద్రం పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎస్ఐ హైమావతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి.

ఈ రెండు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమెతో పాటు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి, ఆర్ఐ ఎస్.గవరయ్య, పరీక్షల పర్యవేక్షణ అధికారులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



కేజీబీవీ ఎస్‌వో ఎంవీ అంబిక

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్‌వో ఎంవీ అంబిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడి బయట ఉన్న అనాథ పిల్లలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తెగలకు చెందిన పిల్లలు, తల్లిదండ్రులు లేని పిల్లలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైనవారు ఏప్రిల్ 11వ తేదీ లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు.

ధర్నా విజయవంతం చేయండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలనే నినాదంతో ఈనెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పెద్దమడి గ్రామంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. గిరిజనుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. మండలంలోని గిరిజనులకు బంజరు, పోరంబోకు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. 50 శాతం గిరిజన ప్రజలు నివాసముండే గ్రామ పంచాయతీలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పలసూరికి నివాళి

నరసన్నపేట: మండలంలోని కోమర్తిలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద దివంగత నక్సలైట్ నాయకుడు మామిడి అప్పలసూరి 28వ వర్ధంతి కార్యక్రమం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, పార్టీ ప్రతినిధులు కృష్ణవేణి, ఎస్.నీలంరాజు, మామిడి క్రాంతి, భాస్కరరావు తదితరులు నివాళులర్పించారు. అమరులు చూపిన బాటలో పయనించి వారి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ చంద్రినాయుడు

సరుబుజ్జిలి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ సీహెచ్ చంద్రినాయుడు సూచించారు. మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాలపై పాలవలస, పురుషోత్తపురం గ్రామాల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. యువత చెడు మార్గాల్లో పయనించకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ధనుంజయరావు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా నేడు

నరసన్నపేట: స్థానిక జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పాసైన నిరుద్యోగ అభ్యర్థులు, డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నవారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. డైకాన్, బ్లూస్టార్ తదితర కంపెనీలు ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. ఎంపికైనవారికి ట్రైనింగ్ అనంతరం పోస్టింగ్ కల్పిస్తారని, శిక్షణ సమయంలో వసతి సౌకర్యం కల్పిస్తారని వెల్లడించారు. ఎంపికైన అబ్బాయిలకు శ్రీసిటీలో, అమ్మాయిలకు హైదరాబాద్‌లో ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పింఛన్ సదుపాయం కల్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నరసన్నపేట: ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్నవారికి ప్రభుత్వం పింఛన్ సదుపాయం కల్పించాలని బ్రైట్ ఫ్యూచర్ డవలప్‌మెంట్ ట్రస్టు ప్రతినిధి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక వీరన్నాయుడు కాలనీలోని కమ్యూనిటీ కేర్ సెంటర్‌లో ఫైలేరియా వ్యాధిగ్రస్తులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధితో పనులకు వెళ్లలేక అనేకమంది అవస్థలు పడుతున్నారని, అటువంటి వారిని వికలాంగులుగా గుర్తించి పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే ఇటువంటి వ్యాధిగ్రస్తులకు బ్రైట్ ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో వైద్యం, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలియజేశారు.

సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు లక్ష్మీనగర్ వీధి శివారు, పాలపోలమ్మతల్లి ఆలయం వెనుకభాగంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఆమదాలవలస మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా సాగర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఏపీఎస్ జాన్సన్, వార్డు సచివాలయ సిబ్బంది, ఆయా వార్డుల నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సంపదరావు మురళీధరరావు, గొండు రవికుమార్, శివ, కూన నాగు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాకు దూరంగా ఉండండి



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న డీసీ శ్రీకాంత్ రెడ్డి

మెళియాపుట్టి: నాటుసారా తయారీ, విక్రయాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని శ్రీకాకుళం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మండలంలోని అంపురం గ్రామంలో నాటుసారా తయారీ నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంపురం గ్రామం సారా తయారీలో ముందంజలో ఉందని తెలుసుకుని, గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సారా మహమ్మారికి దూరంగా ఉంటూ.. కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు, ఎక్సైజ్ సీఐలు మీరాసాహెబ్, ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు, దత్తత గ్రామ అధికారి పిచ్చేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు, సర్పంచ్ డి.జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తెలగ కుల సంక్షేమ సంఘ సమావేశం రేపు

పొందూరు: స్థానిక బ్రాహ్మణ అగ్రహారం వీధిలోని శివాలయం వెనుక ఉన్న తెలగ కుల సంక్షేమ సంఘం భవనంలో తెలగ కులస్తుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు పి.రామారావు, పి.నారాయణరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 3.30 గంటలకు సభ్యులంతా సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

బోరుభద్రలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలో బోరుభద్ర గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు నితీష్ ఆధ్వర్యంలో 123 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి, శ్రీనివాసరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అఖండ నామ సంకీర్తన

కొత్తూరు: మండల కేంద్రంలోని సత్యసాయి ప్రశాంత మందిరంలో సత్యసాయి అఖండనామ సంకీర్తన కొనసాగుతోంది. మందిరం 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 19వ తేదీ నుంచి అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తున్నారు. ఈనెల 23వ తేదీ వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల ప్రజావేదిక నేడు

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు సామాజిక తనిఖీల ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 43 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఫిబ్రవరి 27వ తేదీ నుంచి ఈనెల 21వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీల అనంతరం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

నరసన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.మధుసూదనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

పూడిక తీత పనులు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని ఎస్సీ వీధితో పాటు పలు వీధుల్లో మురుగు నీటి కాలువలు పూడికలు ఏర్పడ్డాయి. దీంతో సర్పంచ్ పడాల కృష్ణవేణి స్పందించి పూడికలు తొలగించేందుకు ఆదేశించారు. ఆదేశాల మేరకు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను శుక్రవారం తొలగించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

కొత్తూరు: మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలపై బాలికలకు అవగాహన అవసరమని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ జడ్జి ఎస్.మణి అన్నారు. మండలంలోని వసప కేజీబీవీలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకొచ్చిన పలు రకాల చట్టాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, ప్రధాన కార్యదర్శి వి.సుధాకరరావు, ఏపీపీ రాడ రాజు, న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, జి.ఫల్గుణరావు, ధర్మారావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.